ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	518.10 (145.8335)	3,32,447	30,881
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.10 (3.80)	526.15	589.52
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.67 (1.10)	208	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.210

నీళ్లొచ్చె..



వరద రాకతో క్రమక్రమంగా నీటిమట్టం పెరుగుతుండటంతో కళకళలాడుతున్న నాగార్జునసాగర్ జలాశయం

•5లో..


నిధులొచ్చె..



రైతుకు రుణమాఫీ చెక్ అందజేస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత, రుణమాఫీ పొందిన ఓ రైతు కుంటుంబం ఆనందం

వన మహోత్సవం

50శాతం లోపే



రాష్ట్రమంతటా మొక్కలు నాటి పచ్చటి వనంగా మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. జిల్లాలో విస్తారంగా ముసురుతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో మొక్కలను విరివిగా నాటాలని అధికారులు నిర్ణయించారు. మొక్కలు నాటడమేగాక నాటిన ప్రతీ మొక్కను బతికించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే ఆచరణలో మాత్రం కార్యాచరణ కానరావడం లేదు. జిల్లాలోని అన్ని రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించగా, అటవీశాఖ అధికారులు ఆ వైపుగా ప్రణాళిక రూపొందించినట్టు లేదని స్వచ్ఛంద సంస్థలు వాపోతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటే కార్యక్రమం సాగడంలేదని విమర్శిస్తున్నాయి.

నల్లగొండ, సూర్యాపేట(కలెక్టరేట్)

జిల్లాల వారీగా మొక్కల లక్ష్యం, పూర్తి ఇలా..

జిల్లా	మొక్కల లక్ష్యం	పూర్తయిన లక్ష్యం
నల్లగొండ	66.06లక్షలు	56శాతం
సూర్యాపేట	53లక్షలు	20శాతం
యాదాద్రి	17.45లక్షలు	42శాతం

- ఉమ్మడి జిల్లాలో నాటాల్సిన మొక్కల లక్ష్యం 1.36కోట్లు
- లక్ష్యం నెరవేరేదెలా?
- 11 ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు ఇచ్చిన ప్రభుత్వం
- నత్తనడకన సాగుతున్న మొక్కలు నాటే కార్యక్రమం
- ఇటీవల వర్షాలు కురిసినా కానరాని ప్రగతి

ఉమ్మడి జిల్లాలో మొక్కలు నాటే లక్ష్యానికి ప్రభుత్వ శాఖలు ఆమడదూరంలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కలు ఉధృతంగా నాటాల్సి ఉండగా, అన్ని శాఖలు నిర్లిప్తంగా వ్యవహరించాయి. ఉమ్మడి జిల్లాలో మొక్కలు నాటే లక్ష్యం 1.36కోట్లు కాగా, ఇప్పటి వరకు 50శాతం లోపే లక్ష్యం పూర్తయింది. సూర్యాపేట జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ జిల్లాలో 20శాతానికి మించి మొక్కలు నాటే లక్ష్యం పూర్తికాలేదు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు సరైన స్థలాన్ని ఎంపిక చేయడంతో పాటు అన్ని రహదారులు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాల్సి ఉంది. ఈ ఏడాది కూడా ప్రతీ కుటుంబానికి ఆరు పండ్ల మొక్కలైన జామ, నిమ్మ, మునగ, ఉసిరి, సీతాఫలం, అల్లనేరేడు పంపిణీ చేయనున్నారు. దీం తోపాటు పూల మొక్కలు గులాబీ, గన్నేరు, చామంతి, మల్లెపూల మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ చెరువుల గట్లపై, ఖాళీ స్థలాల్లో ఈత, ఖర్జూర మొక్క లు నాటనున్నారు. వ్యవసాయ భూముల్లో, గట్లపై టేకు, సుబాబుల్, యూకలిప్టస్, ఈత, ఖర్జూర మొక్కలు నాటనున్నారు. ఖాళీ స్థలాలు, గ్రామీణ రోడ్లు, రహదారులకు ఇరువైపులా వేప, కానుగ మొక్కలు నాటాల్సి ఉంటుంది. మొక్కలను కాపాడేందుకు వాచర్‌ను ఏర్పాటు చేయాలని, మొక్కలను సంరక్షించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వగా, ఉమ్మడి జిల్లాలో ఇవి అమలవుతున్న పరిస్థితి కనిపించడం లేదు.

మొక్కల లక్ష్యం 1.36కోట్లకు పైగానే

వనమాసం కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లాలో వానాకాలంలో 66.06లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. మొక్కల సంరక్షణ కోసం ఫీల్డ్ అసిస్టెంట్ మొదలు మేట్‌లకు శిక్షణ ఇచ్చారు. ఆ బాధ్యతను డీఆర్‌డీవోకు ప్రభుత్వం అప్పగించింది. రహదారులకు ఇరువైపులా స్థలం అధికంగా ఉంటే బహుళ వరుసల్లో మొక్కలు నాటాల్సి ఉంది. జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయిలో మొక్కలు నాటేందుకు కార్యచరణ రూపొందించడంతో పాటు అందుకు అధికారులను కూడా సమాయత్తం చేయాల్సి ఉంది. వన మహోత్సవానికి ఆయా నియోజకవర్గాల్లో స్థానిక శాసనసభ్యులను ఆహ్వానించడంతో పాటు జిల్లా స్థాయి అధికారులకు నిర్దేశించి లక్ష్యాన్ని చేరేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే నర్సరీల ద్వారా మొక్కలు పంపిణీ చేయాల్సి ఉండగా, అవి నర్సరీల్లోనే దర్శనమిస్తున్నాయి. వర్షాలు సమృద్ధిగా లేకున్నా, ఇటీవల నాలుగైదు రోజుల ముసురుతో కూడిన వర్షం కురవడంతో మొక్కలు నాటేందుకు అనువైన వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టి లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాల్సిన అధికారులు స్పందించలేదు. నల్లగొండ జిల్లాలో 11 శాఖలకు మొక్కలు నాటే బాధ్యత అప్పగించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 19.05లక్షలు, అటవీశాఖకు 4 లక్షలు,వ్యవసాయశాఖకు 6లక్షలు, జిల్లా ఉద్యానశాఖకు 5లక్షలు, పంచాయతీరాజ్‌శాఖకు 19.50 లక్షలు, నీటిపారుదల శాఖకు 3.20 లక్షలు, ఐసీడీఎస్‌కు 8వేల మొక్కలు నాటే బాధ్యత అప్పగించారు. పశుసంవర్ధక శాఖకు 30 వేలు, ఎక్సైజ్‌శాఖకు 3 లక్షలు, విద్యాశాఖకు 50వేలు, మునిసిపాలిటీకి 5.63లక్షల మొక్కలు నాటే బాధ్యత అప్పగించగా, ఏ ఒక్క శాఖ కూడా పూర్తిస్థాయిలో నాటిన దాఖలాలు లేవు.

- సూర్యాపేట జిల్లాలో వానాకాలంలో 53లక్షలకు పైగా మొక్కలు నాటాలన్నది లక్ష్యం. అందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో 60 నర్సరీలు, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో 405 నర్సరీల్లో మొక్కలు సిద్ధమయ్యాయి. అటవీశాఖ 6లక్షలు, గ్రామీణాభివృద్ధిశాఖ 25లక్షలు, పంచాయతీరాజ్ లక్ష, ఇరిగేషన్ 4.32లక్షలు, వ్యవసాయశాఖ 3లక్షలు, మునిసిపాలిటీల ఆధ్వర్యంలో 10లక్షల మొక్కలు నాటాల్సి ఉంది.
- యాదాద్రి జిల్లాలో ఈ ఏడాది 17.45 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. అందుకు జిల్లాలో మొత్తం 451 నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. వీటిలో గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన 418 నర్సరీల్లో మొక్కలు పెంచారు. గ్రామీణాభివృద్ధి శాఖ 9లక్షల మొక్కలు, అటవీశాఖ లక్ష, వ్యవసాయశాఖ 25వేలు, ఉద్యానవనశాఖ 50వేలు, పంచాయతీశాఖ 2లక్షలు, సాగునీటిశాఖ 25వేలు, రోడ్లు, భవనాల శాఖ 25వేలు, పంచాయతీరాజ్‌శాఖ 45వేలు, ఆబ్కారీశాఖ 40వేలు, పరిశ్రమలశాఖ 25వేలు, భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, మోత్కురు, పోచంపల్లి మునిసిపాలిటీల్లో 3.17లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యం.

56శాతం మేర మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి

జిల్లాలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా ఇప్పటి వరకు 56 శాతం మేర మొక్కలు నాటాం. వివిధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను ఆయా శాఖలు ఇప్పటికే చేరుకుంటున్నాయి. జిల్లాలో 66లక్షలకు పైగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశాం. లక్ష్యానికి అనుగుణంగా వర్షాకాలంలో పూర్తిస్థాయిలో మొక్కలు నాటుతాం. మరికొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో నూరుశాతం మొక్కలు నాటే కార్యక్రమం పూర్తవుతుంది.

\- రాజశేఖర్, నల్లగొండ జిల్లా అటవీశాఖ అధికారి

ప్రభుత్వశాఖల్లో కదలిక ఏదీ?

వన మహోత్సవం కింద ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది. రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడే బాధ్యతను కూడా తీసుకోవాలి. అయితే జూలై నెల ముగియవచ్చినా, ఇప్పటి వరకు మొక్కలు నాటే కార్యక్రమం ఊపందుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో హరితహారం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని వర్షకాలంలో ఉద్యమంగా చేపట్టి ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలను భాగస్వాములు చేసింది. నాడు మొక్కలు నాటినా సంరక్షణలో మాత్రం నిర్లక్ష్యం కారణంగా చాలా మొక్కలు



చనిపోయాయి. ప్రస్తుతం చాలా ప్రభుత్వశాఖలు వన మహోత్సవంలో పాల్గొనకపోవడం గమనార్హం. అంతేగాక వన మహోత్సవంపై పర్యవేక్షణ కొరవడింది. శాఖల మధ్య సమన్వయం లేకపోవడమూ కారణంగా నిలుస్తోంది. గతంలో మునిసిపాలిటీ సిబ్బంది ఇంటింటికీ మొక్కల పంపిణీతో పాటు విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో సంబంధితశాఖతో పాటు బాధ్యతలు తీసుకున్న శాఖలు ప్రజలకు మొక్కలు పంపిణీ చేసేవి. కానీ, ప్రస్తుతం ఆ వైపుగా చర్యలు కానరావడం లేదు.

రుణమాఫీ సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ లత



రుణమాఫీ ప్రక్రియ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 30: జిల్లాలో రుణమాఫీ విషయంలో రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే వ్యవసాయశాఖాధికారులు వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బీఎస్‌లత అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రెండో విడత రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించగా కలెక్టరేట్‌లో పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో రెండో విడతలో 26,376 మంది రైతులకు సంబంధించి రూ.250.07కోట్ల రుణమాఫీ అవుతుందన్నారు. మొదటి విడతలో జిల్లాలో 56,217 మంది రైతులకు రూ.282.78కోట్ల రుణాలు మాఫీ అయ్యాయన్నారు.

మొదటి, రెండో విడత రుణమాఫీ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక కారణాలతో మాఫీ నిలిస్తే రైతులు మండల, డివిజన్ వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. కొంతమంది రైతుల ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు తప్పుగా ఉండడంతో రుణమాఫీ నిధులు జమ కాలేదన్నారు. వాటిని సైతం అధికారులు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్ చాగంటి అనసూయ, ఆర్డీవో వేణుమాధవరావు, డీఏవో శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డీఎం బాపూజీ, డీసీవో పద్మజ, వివిధ బ్యాంకుల మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులను గమ్యస్థానానికి సురక్షితంగా చేర్చాలి

ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటఅర్బన్, జూలై 30: ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడం సమాజ సేవగా భావించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. సురక్షితంగా బస్సులను నడిపి అవార్డులు పొందడమేగాక ఆర్టీసీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లాలని సూచించారు. దేశవ్యాప్తంగా పదేళ్లలో 1.60కోట్ల మంది రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. హత్యల్లో చోటుచేసుకునే మరణాల కంటే రోడ్డు ప్రమాద రూపంలో ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. రోడ్డు ప్రమాద మరణాన్ని తీవ్ర నేరంగా పరిగణించాలన్నారు. డ్రైవర్లు క్రమశిక్షణతో జాగ్రత్తగా బస్సులు నడపాలని సూచించారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని దీంతో బస్సు డ్రైవర్లకు బాధ్యత మరింత పెరిగిందన్నారు. బస్సు నడిపే ముందు డ్రైవర్లు ఆ బస్సు స్థితిగతులను పరిశీలించి ఏదైనా లోపం ఉంటే సరిచేయించుకోవాలన్నారు. అనంతరం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న ఏడు డిపోలకు చెందిన 21మంది ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఐ జయప్రకాష్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాజశేఖర్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ మాధవి, శివశంకర్, డిపో మేనేజర్ సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, కృష్ణయ్య, పాల్గొన్నారు.

బహుళత్వం హిందూ మత మూల సూత్రం

అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి



ఆంజనేయ స్వామి దేవాలయంలో అఖండ జ్యోతిని వెలిగిస్తున్న విజయశంకరస్వామి

సూర్యాపేట, జూలై 30: హిందూ మత మూల సూత్రాలుగా బహుళతత్వం, సమానత్వం, ఏకత్వ భావనలు ప్రధానంగా ఉన్నాయని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి అన్నారు. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని గట్టికల్లు గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం నిత్య దీపధూప నైవేద్యం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్వేషం, అసమానతలకు హిందూ మతంలో ఏమాత్రం తావులేదన్నారు. ధర్మ పరిరక్షణ భక్తుల చేతుల్లోనే ఉందన్నారు. సనాతన సంస్కృతి, సంప్రదాయాలను ముందుతరాలకు అందించాలంటే గ్రామాల్లోని ఆలయాలదే ప్రధాన పాత్ర అన్నారు. అంతకుముందు గ్రామంలో భక్తులు స్వామి కీర్తనలు పాడుతూ, భజనలు, కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఖదిజ్ఞాని వెంకన్న, బాలసుబ్రహ్మణ్యం, తావుడోజు సైదులు, మోరపాక ఉగ్రయ్య, మడ్డి హనుమయ్య, సామ లింగారెడ్డి, సామ వెంకటరెడ్డి, కొణ రాము, భిక్షం, మల్లయ్య, లక్ష్మయ్య, శ్రీరాములు, సోమయ్య, సత్తయ్య, అబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

గుట్టలో నృసింహుడికి వైభవంగా నిత్యపూజలు

యాదగిరీశుడిని దర్శించుకున్న ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రంగారావు

•5లో..

80వేల పుస్తకాలు చదివిన కేసీఆర్

తన పుస్తకాన్నే చదవలే..

- అసెంబ్లీలో సమావేశాల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు

•5లో..

హామీలను ప్రభుత్వం అమలు చేయాలి

మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన

నేరేడుచర్ల, జూలై 30: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని, లేదంటే ప్రజలు ఉద్యమాల ద్వారా సాధించుకోవాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ భవన్‌లో జరిగిన మహిళా సమాఖ్య సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మహిళా సమాఖ్య బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చి వాటిని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. దీంతో అర్హులైన చాలా మంది నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందేలా మహిళా సమాఖ్య కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వివిధ రంగాల్లో పనిచేసే మహిళలకు జీవిత భద్రత కోసం ఉద్యమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మహిళా సమాఖ్య నాయకులు ఉప్పతల కోటమ్మ, పశ్య పిచ్చమ్మ, అలివేలు, ఉమ, జయసుధ, పద్మ, భ్రమరాంబ, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన



జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు

నల్లగొండ, జూలై 30: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. సూర్యాపేట జిల్లాలో ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ముసురు కురియగా, సగటున 2.9మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తుర్కపల్లిలో 7.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా రాజపేటలో 0.7మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో ఆకాశం మేఘావృతమైంది.

పెద్దఅడిశర్లపల్లి: మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంటపాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి.

దేవరకొండ, కొండమల్లేపల్లి: దేవరకొండ, కొండమల్లేపల్లిలో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షానికి వీధులు జలమయమయ్యాయి. ఇదిలా ఉంటే వారం రోజులుగా దేవరకొండ నియోజకవర్గంలో వర్షాల్లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష ఎకరాలకు పైగా నియోజకవర్గంలో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. దేవకొండ, చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లో వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో పత్తిచేలు వాడిపోయే పరిస్థితి ఏర్పడింది. మంగళవారం రాత్రి దేవరకొండ, కొండమల్లేపల్లితోపాటు పలు గ్రామాల్లో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమసేవకు జాతీయ అవార్డు

దేవరకొండ, జూలై 30: ఉత్తమసేవకు గుర్తింపు లభించింది. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర పర్యావరణ, పరిరక్షణ, అటవీశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డును అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని దేవరకొండ రేంజ్ బేస్‌క్యాంపు ప్రొటెక్షన్ వాచర్ వెంకటయ్య సోమవారం ఢిల్లీలో అందుకున్నారు. కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్ నుంచి వెంకటయ్య ఉత్తమ అవార్డును అందుకున్నట్లు దేవరకొండ రేంజ్ ఎఫ్ఆర్‌వో సాయిప్రకాష్ మంగళవారం తెలిపారు. నల్లమలలో అటవీ భూములు, వన్యప్రాణుల సంరక్షణ, మొక్కల పెంపకం తదితర ఉత్తమ సేవలందించినందుకు వెంకటయ్యను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దిరాజుబావి గ్రామానికి చెందిన వెంకటయ్య 20 సంవత్సరాలుగా అటవీశాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగం చేస్తున్నారు. అటవీశాఖ కార్యాలయంలో కొద్ది రోజులు వాచ్‌మెన్‌గా పనిచేసిన వెంకటయ్యను దేవరకొండ అటవిశాఖ రేంజ్ బేస్ క్యాంపు ప్రొటెక్షన్ వాచర్‌గా నియమించారు.



కేంద్ర మంత్రి నుంచి జాతీయ అవార్డు అందుకుంటున్న వెంకటయ్య

ఐదుగురు సభ్యులతో కూడిన బేస్‌క్యాంపులో వాచర్‌గా విధులు నిర్వహిస్తూ అటవీ సంరక్షణకు కృషి చేస్తున్నారు. తమ సేవలను గుర్తించి ప్రభుత్వం రెగ్యులర్ చేసి ఆదుకోవాలని వెంకటయ్య కోరారు.
























సాగర్‌కు కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైల మల్లన్న చెంత నుంచి కృష్ణమ్మ పరవళ్లు మొదలుపెట్టింది. బిరబిరా పారుకుంటూ నందికొండ మదినిండేలా సాగర్‌కు చేరుతోంది. కొండలు.. గుట్టలు దాటుకుంటూ పరుగున వస్తున్న కృష్ణమ్మను తన ఒడిలో చేర్చుకునేందుకు సాగర్‌మాత.. తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ సిద్ధమైంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు మంగళవారం ఒక్క రోజులోనే ఆరు అడుగుల మేర సాగర్‌నీటి మట్టం పెరిగింది. ఇలాగే వరద రాక కొనసాగితే మరో 10 రోజుల్లో నాగర్జునసాగర్ పూర్తిస్థాయి సామర్థ్యంతో నిండనుంది.

● నాగార్జునసాగర్

● కొనసాగుతున్న ఇన్‌ఫ్లో.. ● 10 రోజుల్లో ప్రాజెక్ట్ నిండే అవకాశం ● త్వరలో ఎడమ కాల్వకు నీటి విడుదల ?

ఎగువనుంచి వస్తున్న వరదతో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం ఒక్క రోజులో ఆరు అడుగులు పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టుకు మంగళవారం సాయంత్రం 4,13,178 క్యూసెక్కుల వరద వస్తుండటంతో, 10 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,75,700 క్యూసెక్కులు, కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 56,747 క్యూసెక్కులు మొత్తంగా 3,32,447 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. దీంతో సోమవారం సాయంత్రం 512.20 అడుగులుగా (136.6461టీఎంసీలు) ఉండగా ఒక్క రోజులో ఆరు అడుగుల నీటి మట్టం పెరిగి మంగళవారం రాత్రికి 518.10 అడుగులకు (145.8335 టీఎంసీలకు) చేరింది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050 టీఎంసీలు), ప్రస్తుతం 518.10 అడుగులుగా(145.8335 టీఎంసీలు) నమోదైంది. సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవాలంటే మరో 167.2856 టీఎంసీలు నీరు సాగర్‌కు వచ్చి చేరాలి. సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవాలంటే ఎగువ నుంచి వరద రాక ఇలాగే కొనసాగితే మరో 10 రోజుల సమయం పట్టవచ్చనని అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 6,041 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం నుంచి 23,940 మొత్తంగా 30,881 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుండగా ఎగువ నుంచి 3,32,447 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.


శ్రీశైలం నుంచి కృష్ణమ్మ పరవళ్లు, 518.10 అడుగుల వద్ద నాగార్జునసాగర్ నీటి మట్టం

ఆగస్టు మొదటి వారంలో ఎడమ కాల్వకు నీటి విడుదల?

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వ కింద ఉన్న ఆయకట్టుకు ఆగస్టు 2 లేదా 3వ తేదీన సాగు నీటిని విడుదల చేయనున్నట్లు సమాచారం. ఎడమ కాల్వ ఆయకట్టుకు సాగు నీరు అందించాలంటే సాగర్‌లో కనీసం 150 టీఎంసీల నీటి లభ్యత ఉండాలి. గత ఏడాది ఎగువనుంచి సాగర్‌కు వరద రాకపోవడంతో ఆయకట్టుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఈ ఏడాది సాగర్‌కు జూలై నెల చివరలోనే ఎగువనుంచి వరద రాక మొదలవడంతో సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం మరో రెండు రోజులల్లో 150 టీఎంసీలకు చేరుకుంటుంది. దీంతో ఈ ఏడాది వానాకాలం సాగుకు ప్రతి ఏడాది మాదిరిగానే ఆగస్టు 2 లేదా 3వ తేదీన సాగు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. నీటి విడుదలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరుకానున్నట్లు తెలిసింది. గత పదేళ్లలో ఒకటి రెండు సంవత్సరాలు మినహా ప్రతి ఏటా ఆగస్టు మొదటి వారంలోనే ఎడమ కాల్వ ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేశారు.

గత ఏడాది బీడుగా మారిన ఆయకట్టు

ఎడమ కాల్వకు ఆయకట్టు కింద 6.50లక్షల ఎకరాల వరి సాగవుతోంది. గత ఏడాది క్రాప్ హాలిడే ప్రకటించడంతో బోర్లు, బావులకింద కేవలం లక్ష ఎకరాలు మాత్రమే సాగు చేశారు. మిగిలిన 5.50లక్షల ఎకరాలు బీళ్లుగానే ఉన్నాయి. ఈ ఏడాది జూలై నెలలోనే సాగర్‌కు వరద రాక మొదలవడంతో ఆయకట్టులో రైతాంగం నారుమడిని సిద్ధం చేసుకుంటున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 517.20 అడుగులు(144.2194 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వకు 5,944 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,744 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 2,52,386 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్ జంట నగరాలతో పాటు మూసీ ఎగువ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మూసీలోకి వరద వస్తోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం కూడా క్రమంగా పెరుగుతోంది. 645 అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 643.10అడుగులు (3.80టీఎంసీ)లుగా నమోదైంది. ఎగువనుంచి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి 636.79 క్యూసెక్కులు ఉండగా, మంగళవారం సాయంత్రానికి కొంత తగ్గి 526.15 క్యూసెక్కులుగా నమోదైంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 589.50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

మేళ్లచెర్వు: పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా 103.67 అడుగులు (1.10 టీఎంసీలు)గా నమోదైంది. ఇన్‌ఫ్లో 208 క్యూసెక్కులు ఉండగా, ఎలాంటి అవుట్‌ఫ్లో లేదు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

● సుమారు రెండు కిలోల గంజాయి స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ అర్బన్, జూలై 30: గంజాయి సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొంతకాలంగా పట్టణ, పరిసర ప్రాంతాల్లో రహస్యంగా సంచరిస్తూ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠా సభ్యుల్లోని తొమ్మిది మందిని అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ రాజశేఖర్‌రాజు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన చల్లా శివనాగరాజు, మంజు లక్ష్మి, దుర్గారావు, మిర్యాలగూడ మండలం జంకుతండాకు చెందిన సిరిపాటి రవీందర్, దుద్దుడుకు అంజి అలియాస్ అంజనేయులు, అవంతీపురం గ్రామానికి చెందిన చెలిమండ్ల సుభాష్, మీసాల ప్రవీణ్ కుమార్, శివాజీ, మిర్యాలగూడ పట్టణం గణేష్‌నగర్‌కు చెందిన షేక్ సమీర్, తరుణ్, లైటింగ్ సమీర్, దామరచర్ల మండలం రాళ్లవాగుతండాకు చెందిన ధీరావత్ ఉపేందర్, బీహార్ రాష్ట్రం, మధువని జిల్లా లక్ష్మీపూర్ కల్యాయ్ గ్రామానికి చెందిన లాలూకుమార్ అనే 13 మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో ప్రవీణ్‌కుమార్, తరుణ్, దుర్గారావు, శివాజీలు పరారీలో ఉండగా, మిగతా తొమ్మిది మందిని ఈ నెల 29న రైల్వేస్టేషన్ రహదారి పక్కన ఉన్న చెట్లపొదళ్లో పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.26వేల విలువ చేసే 1.950 కిలోల గంజాయి లభ్యమైందన్నారు. మాచర్ల మండలానికి చెందిన శివనాగరాజు, మంజు లక్ష్మి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ జిల్లా పాడేరు, నర్సీపట్నం ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడ సరఫరా చేస్తున్నట్లు నేరం అంగీకరించారు. అదేవిధంగా పోలీసుల దాడిలో పట్టుబడిన నిందితులంతా గంజాయి సరఫరా చేయడంతోపాటు వినియోగిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు. నిందితుల్లో బీహార్‌కు చెందిన లాలూకుమార్ దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో పనిచేస్తూ తోటి కార్మికులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు నేరం అంగీకరించినట్లు వివరించారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపామన్నారు. నింతుల నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.3500ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో దాడిచేసి గంజాయి సరఫరా అంతర్రాష్ట్ర ముఠాను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ నరేష్, వాడపల్లి ఎస్ఐ రవి, వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్, ఏఎస్ఐలు యాదగిరి, రాములునాయక్, ఉమాపతిరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అనుమానితుడికి దేహశుద్ధి

భువనగిరి రూరల్, జూలై 30: అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బస్వాపురంలో ఈ ఘటన జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం దన్వాడ గ్రామానికి చెందిన సంపంగి రాము కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అయితే మంగళవారం బస్వాపురంలో అనుమానస్పదంగా తిరుగుతుండడంతో గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన రాముకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స అందించారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరీశుడిని దర్శించుకున్న ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రంగారావు



ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు, రంగారావుకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో

భువనగిరి అర్బన్, జూలై 30: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 11,95,592 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. లక్ష్మీనృసింహుడిని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రంగారావు, కమిషన్ సభ్యులు, హెచ్.జెడొర వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం వారికి వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, ఈవో ఏ.భాస్కర్‌రావు లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

రూ.కోట్లు వెచ్చించినా వసతుల్లేవు

● శాసనసభలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య


మాట్లాడుతున్న అయిలయ్య

భువనగిరి అర్బన్, జూలై 30: యాదగిరిగుట్ట ఆలయానికి రూ.కోట్లు వెచ్చించినా వసతులు లేవని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శాసనసభలో దేవాదాయ పద్దులపై విప్ మాట్లాడారు. అందుబాటులో ఉన్న భూముల్లో 1,000 గదులతో సత్రాలు నిర్మించాలని దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కోరినట్లు తెలిపారు. యాదగిరిగుట్టలో వసతుల కోసం రూ.18కోట్లు ఖర్చు చేసినావసతులు మాత్రం లేవన్నారు. వైటీడీఏ ద్వారా ఎంతో మంది రైతులు భూములు కోల్పోయినా అభివృద్ధి జరగలేదన్నారు. గత ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణం కింద ఎస్సీల భూములు సేకరించి వారికి పరిహారం కూడా పూర్తిగా ఇవ్వలేదన్నారు. ఆలేరు నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని కోరారు. దూపదీప పథకం కింద 6,271మందికి నెలకు రూ. 10వేలు ఇస్తుండగా వాటిని రూ.12వేలకు పెంచాలన్నారు. గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి 9టీఎంసీల సామర్థ్యం నుంచి నాలుగు టీఎంసీల ప్రతిపాదనలు మారుస్తూ తట్టెడు మట్టిని కూడా తీయలేదన్నారు. తపాసుపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని అందించడంతోపాటు గంధమల్ల రిజర్వాయర్‌కు కూడా నిర్మించాలని విప్ కోరారు.

80వేల పుస్తకాలు చదివిన

కేసీఆర్ తన పుస్తకాన్నే చదవలే..

● అసెంబ్లీలో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్


మాట్లాడుతున్న మందుల సామేల్

మోత్కూరు, జూలై 30: 80వేల పుస్తకాలు చదివిన మాజీ సీఎం కేసీఆర్ తన పుస్తకాన్నే చదువక ఆగమయ్యాడని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. ఓడిపోయినా, గెలిచినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 2014లో వారు ఎమ్మెల్యే అయ్యేనాటికి ఎంత భూమి ఉండే, ఇప్పుడు వారికెంత భూమి ఉందో లెక్క తీస్తే వారు ఎంత దోచుకు తిన్నారో తెలుస్తుందన్నారు. ప్రజలను దోచుకుని, కోట్లకు అధిపతులయ్యారన్నారు. నిజాం పాలనలో ఒక్క ఖాసీం రజ్వీ ఉంటే కేసీఆర్ పాలనలో నియోజకవర్గానికొక ఖాసీంరజ్వీ తయారయ్యారని దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో మాట్లాడితే కేసులు, జైలేనన్నారు. నిజమైన ఉద్యమకారులను పార్టీ నుంచి గెంటేశారని, అందుకు ఉదాహరణ తానేనన్నారు. చివరకు తానే ఆ పార్టీని గెంటేయగా కాంగ్రెస్ తనకు టికెట్ ఇస్తే గెలిచానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నికల ముందు బిక్కేరు, మూసీ వాగుల నుంచి ఇసుక తరలించారన్నారు.

ఆగమ శాస్త్ర ప్రకారమే

జీర్ణోద్ధరణ గావించాలి


● శైవాగమ ఆచార్యులు శతశివం, షణ్ముఖ శివాచార్యులు


శైవాగమ సదస్సులో పాల్గొన్న పండితులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నార్కట్‌పల్లి, జూలై 30: ఆగమ శాస్త్ర ప్రకారమే ఆలయాల్లో జీర్ణోద్ధరణ చేయాలని తమిళనాడుకు చెందిన ప్రముఖ శైవాగమ ఆచార్యులు శతశివం, టీఎస్ షణ్ముఖ శివాచార్యలు అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో జరిగిన త్రిదినాత్మక జాతీయ శైవాగమ సదస్సు మంగళవారం ముగిసింది. చివరి రోజు సభకు హాజరై అర్చకులనుద్దేశించి వారు మాట్లాడారు. తెలంగాణ ఆదిశైవ బ్రాహ్మణ అర్చక సంఘం, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, కార్యదర్శి హరికిషన్ శర్మ, నీలకంఠ శివాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా ముగిశాయి. ఈ సదస్సు రాష్ట్రంలో శైవాగమ సంప్రదాయ అర్చకులందరికీ దివ్య సందేశాన్ని ఇచ్చింది. సనాతన ధర్మాన్ని పాటిస్తూనే ఆలయాల నిర్వహణ, ఆచారాల్లో ఆగమాలపై శైవాగమ సదస్సు వర్ధమాన అర్చకులకు దిశానిర్దేశం చేసింది. ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు, దీక్ష వైశిష్ట్యాలు, అర్చనా విధులు, వార, పక్ష, మాస, అయనాది విధులపై మార్గ నిర్దేశం చేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడుకు చెందిన ప్రముఖ శివాచార్యులు హాజరై ఆగమ నియమాలు, ఆచరణలపై తమ అనుభవ పాఠాలను సదస్సులో వివరించారు. ప్రాంతాలను బట్టి ఆచరణలో ఉన్న ఆగమాల విషయాల్లో అనేక మీమాంసలు, సందేహాలను నివృత్తి చేశారు. అనువంశిక అర్చక విధానంపై సదస్సు కీలక తీర్మానం చేసి వారికి బాసటగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ జిల్లా సహాయ కమిషనర్ కే.మహేంద్రకుమార్, చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో సిరికొండ నవీన్‌కుమార్, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'కు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దవూర, జూలై 30: జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చలకుర్తి జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ నాగభూషణం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ జిల్లాలో దరఖాస్తులు చేసుకుంటున్నారో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆ జిల్లాకు చెందిన వారై ఉండాలని, తల్లిదండ్రుల నివాస ధ్రువీకరణపత్రాలు పరిశీలిస్తామన్నారు. 3,4,5 తరగతులు ప్రభుత్వ, రికగ్నైజ్డ్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి ఉండాలని, మే, 1, 2013 నుంచి జూలై 31, 2015 మధ్య జన్మించి ఉండాలని, కనీసం 75సీట్లు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకే కేటాయించినట్లు తెలిపారు. ప్రతీ విద్యార్థి ఒకసారి మాత్రమే దరఖాస్తు చేయడానికి అర్హుడని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ ఉంటుందన్నారు.





18 గొర్రె పొట్టేళ్ల చోరీ

చిట్యాలరూరల్, జూలై 30: వ్యవసాయ పొలం వద్ద ఉన్న 18 గొర్రె పొట్టేళ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. వివరాల ప్రకారం.. ఉరుమడ్లకు చెందిన జాల యాదయ్య, జాల లింగస్వామి, జాల శ్రీను, జాల నర్సింహలు తమ గొర్రెలను బావుల వద్ద కొట్టంలో వదిలి వెళ్లారు. తిరిగి ఉదయం వచ్చి చూసే సరికి మొత్తం 18 గొర్రె పొట్టేళ్ల కన్పించకుండా పోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించి ఉంటారని బాధితులు మంగళవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు..

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో మూడు రోజుల క్రితం గుర్తు తెలియని దొంగలు మూడు ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీచేశారు. అర్వపల్లి గ్రామానికి చెందిన కనుకు మహేష్ రెండు ట్రాక్టర్ల బ్యాటరీలు, మేకల సంతు ట్రాక్టర్ బ్యాటరీ వైర్లు కట్‌చేసి చోరీ చేశారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం గ్రామంలో ఐదు ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీ చేశారు. వారం రోజులుగా 15ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీ చేసినట్లు ట్రాక్టర్ల యజమానులు తెలిపారు. మంగళవారం అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో కనుకు మహేష్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్: పట్టణంలోని ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న చింతలచెరువు వీరస్వామి ఇంట్లో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న వీరస్వామి ఉదయం షాపునకు వెళ్లగా అతని భార్య అరుణ ఇంటికి తాళం వేసి పక్కింటికి వెళ్లి వచ్చింది. కాగా ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం, అదేవిధంగా బీరువా తాళం పగలగొట్టి అందులో ఉన్న మూడు తులాల నల్లపూసల తాడు, రెండు గ్రాముల మాటీలు దొంగిలించారు. దీంతో ఇంటి యజమాని వీరస్వామి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

మోటకొండూరు, జూలై 30: తాటి చెట్టు పైనుంచి జారి పడడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలకేంద్రానికి చెందిన బొల్లేపల్లి సత్తయ్య (55) మంగళవారం మధ్యాహ్నం తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు.

ముగ్గురికి రిమాండ్

భువనగిరి రూరల్, జూలై 30: ట్రాక్టర్ ట్రాలీతోపాటు బోరు మోటార్లు, పైపులు, కేబుల్ వైర్లు దొంగిలించిన ముగ్గురు నిందితులను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ వి సంతోష్‌కుమార్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వీరవెల్లికి చెందిన రేగు మల్లేశ్, నోముల శ్రీశైలం, దయ్యాల నరేశ్‌లు కలిసి గత నెల 3న భువనగిరి శివారులోని రాయిగిరి సమీపంలో గల మోత్కూరు రోడ్డులో ఓ షాపులో సుమారు 100 మీటర్ల కాపర్ వైరును అపహరించారు. అదే నెల 6వ తేదీన నోముల శ్రీశైలం ట్రాక్టర్ ఇంజన్ సాయంతో మండలంలోని చందుపట్ల గ్రామంలోని రైతు నర్సింహకు చెందిన వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాక్టర్ ట్రాలీని దొంగిలించి నోముల శ్రీశైలం వ్యవసాయ బావి వద్ద దాచి పెట్టారు. అదేవిధంగా ఈ నెల 22న మండలంలోని వీరవెల్లికి చెందిన జమ్ముల భిక్షపతి వ్యవసాయ బావిలో రెండు బోరు మోటార్లు, 20 అడుగుల 12 పైపులను దొంగిలించారు. అయితే ఆ దొంగిలించిన పరికరాలను మంగళవారం విక్రయించేందుకు వాహనంలో భువనగిరి వస్తుండగా రాయిగిరి శివారులో పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. పోలీసులు వారిని విచారించగా, ట్రాక్టర్ ట్రాలీ, బోరు మోటార్లు, పైపులను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో రిమాండ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

అంత్యక్రియలకు వెళుతూ.. అనంతలోకాలకు

బీబీనగర్, జూలై30: తమ సమీప బంధువు అంత్యక్రియలకు వెళుతూ వృద్ధుడు అనంతలోకాలకు వెళ్లాడు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రహీంఖానగూడ గ్రామశివారులో మంగళవారం ఈ ఘటన జరిగింది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లికి చెందిన బడుగు నర్సింహ(60) బీబీనగర్‌లోని ఓ మద్యం దుకాణంలో పని చేస్తున్నాడు. కాగా పోచంపల్లిలో తన సమీప బంధువు చనిపోయాడని తెలిసి ద్విచక్ర వాహనంపై బీబీనగర్ నుంచి పోచంపల్లికి బయలుదేరాడు. కాగా మార్గంమధ్యలో రహీంఖానగూడెం గ్రామ శివారులో మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సును ఢీకొట్టాడు. ఈ ఘటనలో నర్సింహ అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సింహ కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాము కాటుతో కార్మికుడు..

చౌటుప్పల్ రూరల్, జూలై 30: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ సమీపంలోని నైల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జార్కండ్ రాష్ట్రానికి చెందిన సుజిత్ మహళి నైల్ పరిశ్రమలో పనిచేస్తూ స్థానిక లక్ష్మీనర్సింహస్వామి కంపెనీ వెంచర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 28న రాత్రి గదిలో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే గమనించిన స్నేహితులు హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పరిశ్రమ కాంట్రాక్టర్ గుండెపురం వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తంగడపల్లిలో యువకుడి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, జూలై 30: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ తంగడపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తంగడపల్లి గ్రామానికి చెందిన బొల్లమోని వెంకటేష్ కుమారుడు సంజీవ (22) ముస్కు అనంత రెడ్డి స్టేడియం సమీపంలో వేపచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నీరు ఉబికింది.. ఫలితం దక్కింది



నిండు కుండలా ఉన్న చెలమ బావి

సాగు నీటి కోసం దశాబ్ద కాలంగా ఆ రైతు భగీరథ యత్నం చేశాడు. మూడు పర్యాయాలు బోర్లు వేయించినా నీటి చుక్క జాడ లేనందున నిరాశ చెందాడు. తన పొలంలో బండరాయి ఉంది. ఆ బండరాయి కింద నుంచి నీరు జాలు వారడానికి గమనించాడు. ఆ బండరాయి ప్రాంతంలో బావిని తవ్వితే నీళ్లు పడతాయని ఆశపడ్డాడు. బావిని తవ్వించగా నీరు ఉబికి వచ్చింది. దీంతో రైతు మోములో ఆనందం వెల్లివిరిసింది.

- అర్వపల్లి

» రైతు భగీరథ యత్నం » బావిలో నీరు పడటంతో ఆనందం

జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపాడు గ్రామానికి చెందిన చిగుర్ల సోమయ్యకు మూడు ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని సాగు నీటి వసతి లేనందున వర్షాధార పంటలను సాగు చేస్తున్నా వ్యవసాయం కలిసిరాలేదు. సాగు నీటితో వాణిజ్య పంటలతో పాటు వరిని సాగు చేస్తే అధిక దిగుబ డులు వస్తాయని,వ్యవసాయం గిట్టుబాటు అవుతుందని ఆశించాడు పదేళ్ల వ్యవధిలో రూ..2లక్షలు వెచ్చించి పొలంలోని మూడు ప్రాంతాల్లో బోర్లు వేయించినా చుక్క నీరు పడలేదు. అయినా రైతులో పట్టుదల తగ్గలేదు. పొలంలోని బండరాయి కిందుగా నీరు జాలువారడాన్ని గమనించాడు. ఆ బండరాయి ప్రాంతంలో బావిని తవ్వితే నీరు పడుతుందని ఆశించాడు. బండరాయి ప్రాంతంలోని పెద్ద పెద్ద బండ రాళ్లను బాస్టింగ్ చేయించి తొలగించాడు. చతురస్రాకారంలో 20 అడుగుల వెడల్పులో బావిని మూడు నెలల క్రితం తవ్వించాడు. బావిని ఏడు అడుగల లోతు తవ్వించగానే భారీగా నీరు ఉబికివచ్చింది. రైతు కష్టానికి ఫలితం తక్కింది. ప్రస్తుతం ఆ బావి నిండు కుండలా కనిపిస్తోంది. ఆ బావి నీటికి రైతు మోటారు అమర్చాడు. ఈ నీటితో ఈ ఏడాది మూడు ఎకరాల్లో వరిని సాగు చేయడానికి సిద్ధమయ్యాడు. సాగు నీటి కోసం ఇన్నేళ్లు ఎదురు చూశానని, ప్రస్తుతం ఈ బావి నీరు తన మూడు ఎకరాల సాగుకు సరిపోతుందని రైతు సంతోషం వ్యక్తం చేశాడు.



సేద్యానికి సిద్ధం చేసిన భూమి

నీళ్ల కోసం ఎన్నో ఏళ్లు ఎదురుచూశా



సాగునీటి కోసం ఎన్నో ఏళ్లు ఎదురుచూశా. నా మూడు ఎకరాల భూమిలో రూ.2లక్షలు ఖర్చు పెట్టి మూడు బోర్లు వేయించినా నీరు పడలేదు. పొలంలో బండరాయి కింద నీరు జాలువారుతున్నందున ఆ ప్రాంతంలో ఏడు అడుగల లోతులో బావిని తవ్వించాను. నీరు పుష్కలంగా పడ్డాయి. నా ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కింది. ఈ ఏడాది వరిని సాగుచేస్తా.

- చిగుర్ల సోమయ్య, కాసర్లపాడు గ్రామం, జాజిరెడ్డిగూడెం మండలం

25న రాష్ట్ర స్థాయి భజన పోటీలు

హుజూర్‌నగర్, జూలై 30: అన్నమయ్య భజనమండలి ఆధ్వర్యంలో పట్టణంలో ఆగస్టు 25వ తేదీ నుంచి 27వరకు రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు బాచిమంచి కొండయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని కనక దుర్గ ఆలయంలో ఈ పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో పాల్గొనేవారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరగిరినాథుని రంగభట్రాచార్యులు, చప్పిడి భిక్షం,రాము, శ్రీనివాసు పాల్గొన్నారు.

కిరాణవ్యాపారి భూపతి రామయ్య మృతి

హుజూర్‌నగర్, జూలై 30: పట్టణానికి చెందిన కిరాణ వ్యాపారి, శ్రీషిర్డీ మందిర శాశ్వత సభ్యుడు భూపతి రామయ్య (83) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య గతంలోనే చనిపోయారు. మృతి పట్ల దేవాలయ కమిటీ అధ్యక్షుడు త్రిపురమళ్ళ అంజయ్య, కార్యదర్శి ఓరుగంటి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు రాము, శేఖర్, గజ్జి ప్రభాకర్, రామ్మోహన్‌రావు, అప్పారావు సంతాపం తెలిపారు. రామయ్య మృతదేహంపై వర్తక సంఘం అధ్యక్షుడు ఉప్పల రమేష్, ఆర్య వైశ్య సంఘం నాయకులు నివాళులర్పించారు.



రామయ్య (ఫైల్ ఫొటో)

రసాభాసగా పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

గరిడేపల్లి, జూలై 30: మండల కేంద్రంలోని మంగళవారం జరిగిన సర్వారం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సంఘ కార్యాలయంలో చైర్మన్ వీరంరెడ్డి శంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి 10 మంది సభ్యులు హాజరయ్యారు.సభ్యులు మినిట్ బుక్‌లో సంతకాలు చేసిన అనంతరం రైతులకు ఎరువుల సరఫరా, స్వల్పకాలిక అప్పులు, రుణమాఫీపై చర్చ జరిగింది. గతంలో సస్పెండైన మాజీ సీఈవోను తిరిగి విధుల్లో తీసుకును అంశం చర్చకు రాగానే, మినిట్ బుక్‌ను చైర్మన్‌తన బీరువాలో పెట్టి తాళం వేసి సంఘ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎవరికీ చెప్పకుండా చైర్మన్ సమావేశం మధ్యలో వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రస్తుత సీఈవో గోపిని సభ్యులు నిలదీశారు. అనంతరం సంఘ సభ్యులు చైర్మన్ రావాలి అంటూ పీఏసీఎస్ ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఉదంతంపై డీసీవో పద్మ వివరణ కోరగా సర్వారం ప్రాథమిక సహకార సంఘంలో జరుగుతున్న పరిణామాలపై సమాచారం తెప్పించుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

రాజ్యాధికారం కోసం బీసీలు పోరాడాలి

సూర్యాపేట టౌన్, జూలై 30: రాజ్యాధికారం కోసం బీసీలు పోరాడాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్యయాదవ్ అన్నారు. ఆగస్టు 6, 7వ తేదీల్లో నిర్వహించే 'బీసీ..చలో ఢిల్లీ' వాల్ పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు బొలిశెట్టి వీరబాబు, పోలోజు మహేష్‌చారి, బయ్య రాజేష్, పరాల సాయి, మధుకర్ పాల్గొన్నారు.

'నేటి అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలి'

సూర్యాపేట టౌన్, సూర్యాపేట, జూలై 30: విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ బుధవారం నిర్వహించే అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 7.31శాతం మాత్రమే నిధులు కేటాయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు పోలెబోయిన కిరణ్‌కుమార్, నల్లగొండ నాగయ్య, పుల్లూరి సింహాద్రి, బండి రవి, పిడమర్తి భరత్, లింగయ్య, వినోద్‌రెడ్డి, దండి ప్రవీణ్ పాల్గొన్నారు.

● నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, విద్య రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, రాష్ట్రంలోని అన్ని శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఈ నెల 31 నిర్వహించే అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం కోశాధికారి బండి రవి ఒక ప్రకనటలో కోరారు.

మహేష్‌కు డాక్టరేట్

తుంగతుర్తి, జూలై 30: మండలంలోని గొట్టిపర్తి గ్రామానికి చెందిన చందా ఉప్పలయ్య- మల్లమ్మ దంపతుల కుమారుడు చందా మహేష్ వ్యాయామ విద్యలో జేఎన్టీయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ప్రిడక్షన్ ఆఫ్ ప్లేయింగ్ ఎబిలిటీ ఆఫ్ కబడ్డీ, ప్లేయర్ అంత్రప్రోమెట్రిక్, ఫిజికల్ ఫిట్నెస్ కాంపోనెంట్స్ విభాగంలో చేసిన పరిశోధనకు మహేష్‌కు డాక్టరేట్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ప్రొఫెసర్ దిలీప్‌కుమార్ అందజేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న మహేష్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: ఆర్ఐ

మోతె, జూలై 30: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించే క్రషర్ మిల్లుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ ఆర్ఐ వసుమతి హెచ్చరించారు. మోతె మండలంలోని రాఘవపురం గ్రామ రెవెన్యూలో నిబంధనలకు విరుద్ధంగా క్రషర్ మిల్లు నిర్వహిస్తున్నారని రైతులు పజ్జూరి శేషయ్య, పజ్జూరి రమేష్, నర్సయ్యలతో మరికొందరు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదుదారులు, క్రసర్ మిల్లు నిర్వాహకులు ,మరికొంత మంది రైతులతో కలిసి మిల్లును ఆర్ఐ పరిశీలించారు. ఈ నివేదికను జిల్లా అధికారులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ అధికారి వెంకన్న, ఆర్ఐ మలునుసుర్ అలీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ లైన్స్

★ లేట్ మ్యారేజ్, సెకండ్ మ్యారేజ్ మరియు ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకోవాలని అనుకునే అమ్మాయిలు, అబ్బాయిలు మమ్మల్ని సంప్రః సెల్: 7702279912 సూర్యాపేట, మిర్యాలగూడ

AJY_161869

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/-Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST 9985413656 9985413365

SURYAPET DIST 9703618713, 9985401015

YADADRI BHONGIRI DIST 9177572576

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, జూలై 30: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వెళుతున్న పంచాయతీ కార్మికులను మఠంపల్లిలో పోలీసులు ముందుస్తుగా మంగళవారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీపీ కార్మికుల సమస్యను పరిష్కరించేంతవరకు సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు.

● గ్రామ పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ యాతాకుల వెంకన్న కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రామ పంచాయతీ వర్కర్ల ధర్నాకు వెళుతున్న సీఐటీయూ నాయకులను ఆత్మకూర్ (ఎస్) మండల పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నీలం అశోక్, వీరన్న, మాతంగి నాగయ్య, బొడ్డు పిచ్చయ్య పాల్గొన్నారు.

● హైదరాబాద్‌కు వెళుతున్న మండల పంచాయతీ కార్మికులను చిట్యాల వద్ద పోలీసులు అరెస్ట్ చేయడం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. హుజూర్‌నగర్‌లో ఆయన మాట్లాడారు.



హైదరాబాద్ వెళుతున్న జీపీ కార్మికులను మఠంపల్లిలో అరెస్టు చేసిన పోలీసులు

కార్యక్రమంలో షేక్ హసన్‌మియా, కొండలు పాల్గొన్నారు.

● మునగాల మండల కేంద్రంలో పలువురి జీపీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు బచ్చలకూరి స్వరాజ్యం మాట్లాడుతూ ప్రభుత్వం జీపీ కార్మికులను అరెస్టు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో దుర్గయ్య, నాగార్జున, సీతరాములు,నాగలక్ష్మి, వెంకయ్య పాల్గొన్నారు.

● పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని సీపీఎం నడిగూడెం మండల కార్యదర్శి బెల్లం కొండ సత్యానారాయణ, సీఐటియూ మండల అధ్యక్షుడు చీమట నాగరాజు అన్నారు. కార్మికులను నడిగూడెం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు వెంకన్న, కమలాకర్ పాల్గొన్నారు.

నాగులపాటిఅన్నారం గ్రామంలో ఒకరికి డెంగీ

పెన్‌పహాడ్, జూలై 30: మండలం నాగులపాటిఅన్నారం గ్రామానికి చెందిన 35 ఏళ్ల యువకుడికి డెంగీ నిర్ధారణ అయినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. విపరీతమైన జ్వరం, వాంతులు, కాళ్ల, చేతులు లాగడం, నీరసం, తలనొప్పి లక్షణాలతో ఆ యువకుడు రెండు రోజుల క్రితం మంచాన పడ్డాడు. సమాచారం అందుకున్న పల్లె దవాఖానా వైద్య సిబ్బందికి ఆ యువకుడిని సోమవారం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఎలిసా పరీక్షలు నిర్వహించగా డెంగీ నిర్ధారణ అయింది. దీంతో రోగి ఇంటి ఆవరణతో పాటు ఆ వీధిలో నాగులపాటిఅన్నారం పల్లె వైద్య సిబ్బంది పంచాయతీ సిబ్బందితో బ్లీచింగ్ చల్లించారు. నీటి నిల్వ ఉన్న పాత్రలు తొలగించారు. మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. గ్రామంలో మరో ముగ్గురి రక్త నమూనాలను వైద్య సిబ్బంది సేకరించి పరీక్షల కోసం ఆస్పతికి పంపారు. గ్రామంలో పారిశుధ్యం లోపించినందునే అంటు వ్యాధులు, సీజనలు వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెచ్‌ఈవో చంద్రశేఖర్‌రాజు, హెల్త్ అసిస్టెంట్ మధు, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు కవిత, సుజాత, జ్యోతి, రజిత, పార్వతి, గ్రామ పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్, నర్సయ్య, నాగరాజు, వీరస్వామి పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు అండగా నిలిచిన రాజీవ్‌సాగర్

తుంగతుర్తి, జూలై 30: మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన రెడ్డిమల్ల రాజేష్ ఆర్టీఎల్ డిజైన్ అండ్ వెరిఫికేషన్‌లో కోర్సు అభ్యసించడానికి అదే గ్రామానికి చెందిన తెలంగాణ మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ సాయం అందించారు. ఆరు నెలల పాటు కోర్సును పూర్తి చేయడానికి అయ్యే ఖర్చు ప్రతి నెలా రూ.20వేలు చొప్పున మొత్తం రూ.1.20లక్షలు రాజీవ్‌సాగర్ ఇచ్చారు. కోర్సు పూర్తైనందున విద్యార్థి రాజేష్‌కు సర్టిఫికెట్ వచ్చింది. ఈ సందర్భంగా రాజీవ్‌సాగర్‌ను విద్యార్థి రాజేష్ మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సాయిబాబా దేవాలయం వార్షికోత్సవం రేపు

కోదాడ రూరల్, జూలై 30: మండలంలోని తమ్మర గ్రామంలో సాయిబాబా దేవాలయాన్ని ఏడో వార్షికోత్సవానికి ముస్తాబు చేశారు. ఆగస్టు ఒకటో తేదీన వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అలయ కమిటీ నిర్వాహకుడు కమతం రాము తెలిపారు. ఉదయం ఐదు గంటలకు కాకడ హారతితో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. వార్షికోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొలన్నారు.మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రవీణ్

హుజూర్‌నగర్, జూలై 30: పట్టణంలోని 100 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ కరుణ్ నార్కెట్‌పల్లికి బదిలీ అయ్యారు. హుజూర్‌నగర్‌లోని ఏరిఆయా ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యునిగా పనిచేస్తున్న ప్రవీణ్ ఆసుపత్రి ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేరుస్తామన్నారు. కాగా ప్రవీణ్‌ను డాక్టర్లు అభినందించారు.

ఆర్డీవో కార్యాలయ డీఏవోగా రాజేందర్‌రెడ్డి

హుజూర్‌నగర్, జూలై 30: హుజూర్‌నగర్ ఆర్డీవో కార్యాలయ డీఏవోగా రాజేందర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలో డీఏవోగా పనిచేసిన కాశీనారాయణ మే 31న ఉద్యోగ విరమణ చేయగా, అప్పటి నుంచి ఇన్‌చార్జి డీఏఓగా డీటీ లావణ్య పనిశారు. కాగా ఆమె సూర్యాపేట డీటీగా బదిలీ కావడంతో నాగర్‌కర్నూల్‌లో డీఏవోగా పనిచేస్తున్న రాజేందర్‌రెడ్డి బదిలీపై హుజూర్‌నగర్‌కు వచ్చారు.కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, మంత్రిప్రగడ అప్పారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీహెచ్‌వోగా బిచ్చునాయక్ బాధ్యతల స్వీకరణ


అర్వపల్లి, జూలై 30: అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వోగా మాలోతు బిచ్చునాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బిచ్చునాయక్ తిరుమలగిరి నుంచి బదిలీపై అర్వపల్లికి వచ్చారు.

అనంతగిరి తహసీల్దార్‌గా హిమబిందు

అనంతగిరి, జూలై 30: మండల తహసీల్దార్‌గా హిమబిందు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ తహసీల్దార్‌గా పనిచేసిన హిమబిందు బదిలీపై అనంతగిరికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

అధికారుల సర్వేను అడ్డుకున్న గ్రామస్థులు

తుంగతుర్తి, జూలై 30: మండలంలోని వెంపటి గ్రామంలో వక్ఫ్ బోర్డు అధికారుల సర్వేను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామంలోని సర్వే నెం. 649లోసయ్యద్ సారాజ్ ఉసేని బాబా దర్గాకు చెందిన 21 ఎకరాల 20 గుంటల భూమి వక్ఫ్‌బోర్డు ఉందని, ఆ భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని సయ్యద్ జాకీర్ హుస్సేన్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వక్ఫ్ బోర్డు ఉమ్మడి నల్లగొండ జిల్లా అధికారులు మహమ్మద్ మహమూద్ తమ సిబ్బందితో, స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారుల సహకారంతో సర్వే చేస్తుండగా స్థానికులు అడ్డగించారు. తాత, ముత్తాతల కాలం నుంచి తమకు ఇక్కడే ఇళ్లు ఉన్నాయని, సమాచారం ఇవ్వకుండా ఎలా సర్వే చేస్తారని గ్రామస్థులు వాగ్వివాదానికి దిగారు. దీంతో ఘర్షణ జరిగే అవకాశం ఉండడంతో సీఐ శ్రీను నాయక్ ప్రజలకు నచ్చజెప్పి పంపించారు. ఈ ఉదంతపై జిల్లా ఉనతాధికారులకు నివేదిక పంపుతాని వక్ఫ్‌బోర్డు అధికారులు తెలిపారు.



సూర్యాపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో రిటైర్డు ఉద్యోగుల సాముహిక పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి, హమీద్‌ఖాన్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: సూర్యాపేట పట్టణంలో బుధవారం నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇమాంపేట నుంచి పట్టణానికి వచ్చే మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ ధ్వంసమైనందున మరమ్మతు చేయడానికి నీటి సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

సూర్యాపేట(కలెక్టరేట్): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు కోరారు. కలెక్టరేట్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ బీఎస్‌లతకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

సూర్యాపేట: ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఏనుబాముల గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నెం.214లో ఉన్న దేవాలయ భూమిని కోటి నాయక్ తండాకు చెందిన కొంతమంది ఆక్రమించుకుంటున్నారని శ్రీగంగాపార్వతీ సమేత ఆంజనేయస్వామి దేవస్థానం సభ్యులు తెలిపారు. ఈ భూమిని ఆక్రమించుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వినోద్ కుమార్‌కు ఎస్.వెంకటరెడ్డి, వర్రె లింగయ్య, వర్రె సైదులు, గజవెల్లి సూరయ్య, వి.రాములు వినతిప్రతం అందజేశారు.

పెన్‌పహాడ్: బాలికలను వేధించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పెరక రవీందర్ హెచ్చరించారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులను కల్పించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఎంఈవో రవి, ఇన్‌చార్జి తహసీల్దార్ ధరావత్ లాలు, ప్రిన్సిపాల్ కళావతి, ఏపీఎం అజయ్‌నాయక్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: సాగర్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పోసనబోయిన హుస్సేన్, దుగ్గి బ్రహ్మం, వెంకటనారాయణ, మురళి, వీరబాబు, జేవీ పాల్గొన్నారు.

●హుజూర్‌నగర్ పట్టణంలో మల్లన్ననగర్‌కు చెందిన రహీంకు రూ.50వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోడి ఉపేందర్, శ్రీను, రాము, వెంకన్న పాల్గొన్నారు.

● విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, డీఎస్సీ ప్రకటించాలనిపీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్‌రావు కోరారు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో శివ, రాము, వెంకన్న పాల్గొన్నారు.

● గరిడేపల్లి ఎంఈవో చత్రునాయక్ మనవడు ప్రధ్యుమ్నరాం అనప్రాశన సందర్భంగా హుజూర్‌నగర్ పట్టణంలోని జీప్సీ అనాథాశ్రమంలో అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాణోతు వెంకటేశ్వర్లు, శ్రీను, వెంకన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

●హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ముడెం కోటిరెడ్డి మృతి బాధాకరమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, కార్యదర్శి జక్కుల వీరయ్య అన్నారు. ముడెం గోపిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాప కార్యక్రమంలో జక్కుల నాగేశ్వరరావు, సురేష్, విశ్వనాథ్, రవికుమార్, యాదగిరి, సురేష్, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి అంజయ్య, గోపినాథ్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: మండలంలోని వేపలసింగారం గ్రామంలోని మేళ్లచెరువు రోడ్డులో హరితహారం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. నిందితులను పోలీసులు గుర్తించి గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరారు.

నేరేడుచర్ల: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వాసా పల్లయ్య, సయ్యద్ హుస్సేన్, వాసా కరుణాకర్, రాజాక్, విజయ్, రాములు, దేవయ్య, అజీమ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: వికాస తరంగిణి మహిళ ఆరోగ్య వికాస్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో ఆగస్టు మూడో తేదీన అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

● మఠంపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగే జిల్లా చైతన్య సదస్సును గిరిజన కుల సంఘాల నాయకులు, మేధావులు, యువకులు విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు భూక్య పాండునాయక్, జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్ కోరారు.ఈ కార్యక్రమంలో బానోతు నాగేశ్వరావునాయక్, పి.రాము, వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.

●ప్రభుత్వం రెండో విడతలో ఒక్కో రైతుకు రూ1.50లక్షల మేరకు పంట రుణాలనుమాఫీ చేస్తూ నిధులు విడుదల చేయడంతో మఠంపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు ఆదూరి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతులు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో మండల అధికారులు పాల్గొన్నారు.

● సైబర్ నేరాలపై యువకులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ ఆనంద్‌నాయక్ అన్నారు. మఠంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు.

● మఠంపల్లి మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధిలోని అమరేశ్వరి సిమెంట్ పరిశ్రమ సమీపంలోని సర్వే నెం.540లో కోట్లాది రూపాయల విలువైన భూములను పలువురు ఆక్రమించారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి చిలక దేవభిక్షం ఆరోపించారు. ఈ విషయమై రెండేళ్ల క్రితం రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదన్నారు. అధికారులు కనీసం విచారణ చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ మంగా రాథోడ్‌ను వివరణ కోరగా ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మునగాల: సాగర్ ఎడమ కాల్వకు నీటిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఉడుం కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

చిలుకూరు: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రుణమాఫీ సందర్భంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సంబురాల కార్యక్రమాన్ని ఆర్డీవో సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు ఈ కార్యక్రమంలో ఏఈఓలు చంద్రశేఖర్, శిరీష, రైతులు పాల్గొన్నారు.

● చిలుకూరు మండల కేంద్రం అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎంపీడీవో గిరిబాబు అన్నారు. చిలుకూరులో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నారాయణరావు, కార్యదర్శి షరీపుద్దీన్ పాల్గొన్నారు.

కోదాడ: వాహనాదారులు విధిగా ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించాలని కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ అన్నారు. మంగళవారం కోదాడలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట లైట్ మోటార్ అసోసియేషన్ సభ్యులతో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. . ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కొంగల వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ ఎరగని రామయ్య, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో కొల్లు వీరయ్య, పద్మావతి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జూకూరి అంజయ్య, కోట తిరుపతయ్య, దేవరశెట్టి హనుమంతరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: కోదాడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లుగా పనిచేస్తున్న ఆర్.సైదులు, పి.శ్రీనివాస్, ఎస్‌కె.మదార్‌ను ఎస్పీ సన్మానించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ రాజశేఖర్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ శివశంకర్, మేనేజర్లు మాధవి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

● వ్యవసాయ విద్యుత్ లైన్ పనుల కోసం మండలంలోని దోరకుంట అగ్రికల్చర్, నెమలిపురి ఆర్అండ్ఆర్ సెంటర్‌కు బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కోదాడ రూరల్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

● కోదాడ మండలం గుడిబండ గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు తూమాటి చిన్నభిక్షమారెడ్డి సతీమణి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తూమాటి శ్రీనివాస్‌రెడ్డి తల్లి సీతమ్మ మృతిచెందారు. మంగళవారం ఆమె భౌతిక కాయానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి నివాళులర్పించారు కార్యక్రమంలో ఎండీ రఫీ, పులి రాజారావు, హసన్ అలీ, శ్రీనివాసుల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

● పేదల సమస్యలు పట్టని కేంద్ర ప్రభుత్వ విధానాలపై సీపీఐ శ్రేణులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. కోదాడలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సమావేశంలోమేకల శ్రీనివాసరావు, షేక్ లతీఫ్, బత్తిని హనుమంతరావు, బద్ధం కృష్ణారెడ్డి, పైడిమర్రి వెంకటనారాయణ పాల్గొన్నారు.

● తలసేమియా చిన్నారులకు జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో రక్తదానం ఏర్పాటు చేయడం అభినందనీయమని కోదాడ కోర్టు ఏజీపీ సంపెట సుధాకర్‌గౌడ్ అన్నారు. కోదాడ మండలంలోని కొమరబండలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముత్తయ్య, నిఖిల్, నవీన్, ఉషన్, నవీన్, గోపి, సచిన్, అనిల్, అరవింద్, చరణ్, రాకేష్, నాగుల్ పాల్గొన్నారు.

నడిగూడెం: పాస్టర్ల మండల కమిటీని మంగళవారం నడిగూడెం మండలంలోని వల్లాపురంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బి.గాబ్రియేల్, ప్రధాన కార్యదర్శిగా వై.ప్రకాష్, కోశాధికారిగా జైపాల్, ఉపాధ్యక్షుడిగా వాసు, లాజర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలోనియోజకవర్గ పాస్టర్లు సుదర్శనం, సుందర్‌లాల్ పాల్గొన్నారు.

●ఉద్యోగ విరమణ చేసిన నడిగూడెం కళాశాల ప్రిన్సిపాల్ సోమయ్యను ఇంటర్ బోర్డు చైర్మన్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఇంటర్ జిల్లా అధికారి జానపాటి కిష్టయ్య సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాల సాధనకు సోమయ్య కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ప్రభాకర్‌రెడ్డి, రేపాల శ్రీనివాస్, ప్రసాద్, రవి, పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: సీజనల్ వ్యాధులతో ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని తాటిపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఏఎన్ఎం సంధ్యారాణి అన్నారు. తాటిపాముల ఉన్నత పాఠశాలలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, సీత, డాక్టర్ లింగయ్య, సంతోష్‌కుమార్, బాలకిషన్, వెంకన్న, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన్‌కల్: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నేరెళ్ల దేవరాజు, నాగిరెడ్డి జితేందర్‌రెడ్డి, సంతోష్, మన్నె శ్రీదేవి పాల్గొన్నారు.

● పాస్టర్ల నూతనకల్ మండల కమిటీని మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నకిరేకంటి సైమన్, ఉపాధ్యక్షుడిగా మరికంటి యిర్మియ, ప్రధాన కార్యదర్శిగా పిట్టల సామేలు, కోశాధికారిగా నకిరేకంటి మనిషై, ఆర్గనైజర్‌గా ఏటుకూరి డేవిడ్, సహాయ కార్యదర్శిగా బాలరాజులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రూబెన్, వీరేష్, బాలునాయక్, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

● తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న నూతనకల్ మండల కాంట్రాక్ట్ ఉద్యోగులు మంగళవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో బి.జానకిరాములు, టి.వీరస్వామి, కె.రవీందర్, జె.లింగస్వామి, ఉపేందర్‌రెడ్డి, మధుకర్, విజయ్, మురళి ఉన్నారు.

● బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టే 'చలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

అర్వపల్లి: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మణిదీప్ అన్నారు. సీజనల్ వ్యాధులపై అర్వపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో బిచ్చునాయక్, హెచ్ఎం విజయలక్ష్మి, మల్లేష్, లలిత, జ్యోతి పాల్గొన్నారు.